# ఈనాటి తండ్రులు

-ఎం.మాధవీకృష్ణ

సుప్రభాత సమయం. వాతావరణం బాగా చలిగా ఉంది. పచ్చని చెట్ల మీది మంచుబిందువులు తడిపొడిగా పడుతున్న వెలుగురేఖలకి మెరుస్తు న్నాయి. కార్తీకమాసం చలి కాస్తంత తగ్గిందనుకోవడానికి లేకుండా ధను ర్మాసపు ఎముకలు కొరికే చలి మనుషుల్ని వణికిస్తోంది.

"స్వామియే శరణం" అంటూ అయ్యప్ప భక్తులు అప్పటికే ఇళ్ళల్లో స్నానాలు, పూజాధికాలు ముగించి దైవదర్శనానికి బయలుదేరారు.

"మామయ్యా! మంకీ కేప్ పెట్టుకున్నారా?" వాకింగ్‌కు బయల్దేరుతున్న రఘురామ్‌ను హెచ్చ రిస్తూ అడిగింది సరళ.

"స్వెట్టర్లూ, టోపీ అన్నీ వేసుకున్నాలేమ్మా!" సమాధానమిచ్చాడు.

"మామయ్యా! సాక్స్ ఉతికినవి ఆ సైడ్‌ర్యా క్‌లో పెట్టాను. వెతుక్కుంటారేమో!" చెప్పింది వనజ.

"ఆఁ..ఆఁ...చూశాను" సాక్స్, షూస్ తీసుకుని వాకిట్లో మెట్ల దగ్గర కూర్చుంటూ చెప్పాడు.

"ఏరా! క్రొత్త పెళ్లికొడకా. ఇప్పటికైనా బయల్దేర తావా?" ఐదునిము

షాలు ముందుగానే రావడంతో రఘురామ్ వాళ్ళ కాంపౌండ్‌లోనే జాగింగ్ చేస్తూ అడిగాడు దామోదరం.

"వస్తున్నాలేవోయ్ తోడి పెళ్లికొడకా. విశాలా తలుపులేసుకో" భార్యకి చెప్పి బయటపడ్డాడు రఘురామ్.

వాళ్లిద్దరూ అరవైకి చేరువయినవాళ్ళే. బాధ్య తలూ, బరువులూ మోసీ, మోసీ ఈమధ్యనే భుజాల భారం దింపుకున్నారు.

ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు. పైపెచ్చు రిటై రయ్యేనాటికి ఒకే ఊళ్ళో, ఒకే కాలనీలో దగ్గరగా స్థిరపడ్డారు.ఆర్థికంగా మంచి పొజిషన్‌లో ఉన్నారు. రఘురామ్ ఇద్దరు కొడుకులతో కలిసి ఉంటుంటే దామోదరం పెద్దకొడుకు ఉద్యోగరీత్యా దూరాన ఉండడంతో చిన్నవాడి దగ్గర స్థిరపడ్డారు. ఈ మధ్యనే రఘురామ్ బిజినెస్ నుంచి, దామోదరం ఉద్యోగం నుంచి రిటైర్‌మెంట్ తీసుకున్నారు.

ఇద్దరూ నిదానంగా వాకింగ్ చేస్తూ వాళ్ళ సిట్టింగ్ ప్రాంతమైన పార్క్‌కి చేరుకున్నారు. ప్రతిరోజూ అరగంట వాకింగ్ తర్వాత ఓ పావు గంట పార్క్ బయట బెంచీపై కూర్చోవడం, మళ్లీ నడక సాగించి ఇంటికి చేరడం ఐదారేళ్ళుగా జరు గుతున్న కార్యక్రమం. రఘురామ్ కుటుంబం..ఆ కుటుంబసభ్యుల మధ్య ఉన్న మమతానురాగాలు వారి అన్యోన్యత చూస్తుంటే ముచ్చటేస్తుంది దామోదరానికి. అతనిదీ మంచి జీవితమే కానీ ఎక్కడో ఏదో వెలితి. కనీ, కనిపించని, వినీ, వినిపిం చని అసంతృప్తి. రఘురామ్ పెద్దకొడుకు తండ్రి వారసత్వంగా బిజినెస్ చూసుకుంటుంటే, చిన్న కొడుకు అదే ఊళ్ళో కాలేజీ లెక్చరర్‌గా స్థిరప డ్డాడు. కూతుర్ని దగ్గర్లోనే డాక్టర్‌గా నర్సింగ్‌హోమ్ నడుపుకుంటున్న యువకుడికిచ్చి పెళ్ళి చేశాడు.

కొడుకు, కోడళ్లతో ఇద్దరు మనవళ్ళు, ఇద్దరు మనవరాళ్లతో సంతోషంగా సంసారంలో సరిగమ లుగా సాగుతోంది ఆయన జీవితం.

కోడళ్ళను కూడా కూతుళ్ళుగా రఘురామ్ దంపతులు చూసుకుంటుంటే వీరిని తల్లిదండ్రుల్లా వారూ ఆదరిస్తున్నారు. ఎవరికో కానీ అరుదుగా పట్టే అదృష్టం అది. కోడళ్ళిద్దరి పేరునా వాళ్ల పెళ్లి ఖర్చులు పోను మిగిలినదానికి మరికొంత కలిపి ఫిక్స్‌డ్ డిపాజిట్ వాళ్ల పెళ్లినాడే వేశారు రఘురామ్ దంపతులు. నెలనెలా ఇంతని వచ్చే వడ్డీని బ్యాంకు నుంచి డ్రాచేసి ఫస్టు తారీఖున వారి చేతిలో పెడ తాడు ఆయన. ఆడవాళ్లైనా వారికీ ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలని నమ్మే వ్యక్తి ఆయన.

ఆ డబ్బుకి సంబంధించి దాని ఖర్చు గురించి ఇంట్లో వాళ్ళెవ్వరూ సరళనూ, వనజనూ అడగరు.

అది మిగతవాళ్ళు తమకిచ్చిన గౌరవం అని బాగానే అర్థం అయింది సరళకు, వనజకు.

భార్య విశాలకైనా అటువంటి ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చాడు రఘురామ్. ఇక పుట్టినరో జులైనా, పెళ్లిరోజులైనా పండుగలే వాళ్లకి. కొడుకు లతో పాటూ కోడళ్ళిద్దరి పుట్టినరోజులకు కూడా కుటుంబసభ్యులంతా కలిసి ఉదయాన్నే గుడికి వెళ్లడం, వారి పేరున అర్చన చేయించడం, సాయంత్రం వేళల్లో వాళ్లకి పర్సనల్ ఫ్రీడం అంటూ అవసరమైతే వారి పిల్లల్ని కూడా దగ్గర పెట్టుకుని ఆ భార్యాభర్తలిద్దరినీ సరదాగా తిరిగి రమ్మని బయటికి పంపిస్తారు.

ఇక పెళ్లిరోజులు సరేసరి. ఆ జంటకి విషెస్ చెప్పి ఇంట్లో ఉన్న నలుగురూ కలిసి కేక్ కట్ చేయించడం, పిండివంటలతో భోజనాలు...సర దాగా సాగుతుంది. మిగతావాళ్ళు అలాగే రఘురా మ్‌కి కానీ విశాలకు గానీ బర్త్‌డేలు వస్తే వాళ్లని ఫ్రీగా వదలరు. నెలకొక రెండుసార్లు దంపతులిద్దరూ ఇంటినుంచి బయటపడి సరదాగా షికారు చేసొ స్తారు. మధ్యమధ్యల్లో మనవలో, మనవరాళ్లో "క్లాస్ ఫస్ట్ వచ్చాను తాతయ్యా" అనో "కాంపిటీష న్స్‌లో ప్రైజ్ వచ్చింది నానమ్మా" అనో దగ్గర చేర తారు. మర్నాడు వాళ్లను అభినందిస్తూ వాళ్ళకు అవసరమైన వస్తువులో, వాళ్ళు చాన్నాళ్ళుగా అడుగుతున్నవో గిఫ్టుగా ప్రెజెంట్ చేస్తారు.

అది ఒకరకంగా ఆ చిన్నారుల కష్టాన్ని గుర్తించి ప్రోత్సహించడమే అనుకుంటారు వాళ్ళు.

పెద్ద కోడలికష్టమని గుళ్ళు, గోపురాలకు చందాలు, చిన్నకోడలు అభిరుచికి తగ్గట్లు అర్ఫన్ హోమ్స్‌కి డొనేషన్లూ వాళ్లతోనే ఇప్పించేవాడు రఘురామ్. కొడుకుల ఇష్టానికి తగ్గట్లు వాళ్ల అభి రుచి ప్రకారం వండిపెడుతుంది విశాల.

ఇక మురిపాలు మూటకట్టే మనవలు, మనవ రాళ్ళూ, వాళ్ల కోరికలూ సరేసరి. విడివిడిగా జంట లుగా వెళ్ళేదికాక సంవత్సరానికొకసారి కుటుంబ మంతా కలిసి ఏదైనా టూర్‌కి వెళ్తొస్తారు. అలాగే వియ్యంకులు కూడా పండుగలకూ, శుభకార్యా లకూ అల్లుళ్లతో పాటూ వీళ్ళనీ రమ్మని పిలు స్తారు. ఎప్పుడైనా కొడుకులిద్దరూ అత్తవారింటికి పండుగకు వెళ్లడం, సమయానికి కూతురు కూడా ఆ పండక్కి రాలేనని కబురుచేస్తే ఒంటరిగా అన్పిం చకుండా వియ్యంకుల ఇళ్లకు వెళుతుండడంతో వీరికి వారికీ మధ్య సత్సంబంధాలు బలపడ్డాయి.

ఆర్థికంగా రఘురామ్ కుటుంబం బాగానే ఉండడంతో ఎప్పుడైనా సరళ, వనజ పుట్టిళ్లల్లో చిన్న చిన్న ఇబ్బందులు ఏర్పడ్డా సహాయం అందించేవాళ్ళు రఘురామ్, విశాల.

"రఘూ! నిన్నొక మాట అడగాలోయ్" చెప్పాడు దామోదరం.

"ఊఁ...కానీ" అన్నాడు.

"నిన్న మా సుభద్ర చెప్పింది. మీ పెద్దవాడి పదో పెళ్లిరోజని. మీవాడికి నీ బ్రేస్‌లెట్, మీ ఆవిడ

తన వడ్డాణం కోడలికి ప్రెజెంట్ చేశారట. నిజమేనా!'' అడిగాడు దామోదరం.

"అవును నిజమే'' తలఊపాడు.

"అంటున్నానని కాదు కానీ మనకున్నవన్నీ ఇప్పట్నించే ఇస్తూ వస్తే ఈ పిల్లలు తర్వాత మన మాట వింటారంటావా?'' అడిగాడు.

"ఏమిట్రా? నువ్వేదన్నా నీ పిల్లలకు కాకుండా ఆశ్రమాలకు రాద్దామనుకుంటున్నావా?'' నవ్వుతూ అడిగాడు రఘురామ్.

"ఆ పని నువ్వు, నేను ఇద్దరమూ చేయలేం కానీ సమాధానాన్ని దాటవేయకు'' అసహనంగా అడిగాడు.

"మాకేం ఇబ్బంది వుందిరా? ఆల్రెడీ మా పేర్న ఫిక్స్‌డ్ ఉంది. అయినా మన తర్వాతైనా వాళ్లకే కదా!'' అడిగాడు.

"నిజమే. కానీ ఈ విషయంలో మీ ఇద్దరి పద్ధతి నాకు నచ్చలేదు. చిన్నగా ఒక్కొక్కటీ ఇస్తూ రావడం, పైగా వియ్యంకుల ఇళ్ళకు కూడా సహాయాలు... పెద్ద దానకర్ణుడిలాగా'' విసుగ్గా అన్నాడు.

"చూడు దామోదరం. విలువలనేవి మన అంతరంగాన్నుంచి వచ్చేవి. ఆ భగవంతుడి దయవల్ల ఇప్పటివరకూ నాకుటుంబంలో సమస్యలు లేవు. పరిస్థితులు మారితే బహుశా పిల్లలు కూడా వృద్ధాప్యంలో మమ్మల్ని నిరాదరించడమో, బయటికి గెంటేయడమో కూడా చేయవచ్చేమో. అట్లాంటి పరిస్థితి వస్తే దాన్ని ఎదుర్కోవడానికి నేనూ, విశాల సిద్ధంగా ఉన్నాం.తీరా సమయమే వస్తే మా పేర్న ఉన్న కాస్తంత డబ్బు ఏ ఆశ్రమంలోనో ఇచ్చి హాయిగా మా తోటివాళ్ల మధ్య నవ్వుతూ మా జీవితాలు గడిపేస్తాం. దేనికైనా నమ్మకమే పునాది. మన బిడ్డల్ని మనం నమ్మక వాళ్ళు మనల్ని నమ్మక మన మధ్య సరైన ప్రేమ, అవగాహన లేక ఇప్పట్నించే ఇల్లు నరకప్రాయం చేసుకోవడం ఎందుకు? ఉన్నన్నాళ్ళూ సంతోషంగా బ్రతకడమే కదా కావలిసింది?'' చెప్పాడు రఘురామ్.


"కానీ.. వాళ్ల పుట్టిళ్ళకు కూడా సహాయం చేస్తే చులకన కామూ?'' నసిగాడు.

"చూడరా! మన ఇళ్లకు డొనేషన్లంటూ చాలా మంది వస్తుంటారు. గుళ్లకని, అనాథాశ్రమాలకని అంతెందుకు? నిన్న మొన్నటి సునామీకి కూడా నాతో పాటు నువ్వు బట్టలూ, డబ్బు ఇచ్చి పంపించావు. ఎవరైనా పేదరికం వల్ల చదువుకోవడం ఆగిపోతుందనో, హాస్పిటల్ ఖర్చులకనో వస్తే ఇద్దరమూ ఎంతో కొంత ఇచ్చి పంపుతున్నాం. మరి అలాంటప్పుడు ఎవరెవరికో చెయ్యగలిగినప్పుడు మన ఇంట్లో మనతో జీవితాంతం బ్రతికేవాళ్లకు వాళ్ల ఆనందం కోసం ఇస్తే తప్పేంటి? ఆలోచించు'' ఇంటిదారిపడుతూ చెప్పాడు రఘురామ్.

ఓరోజు కొడుకు, కోడలు గుసగుసలు పోవడం, తర్జనభర్జనలు పడడం, కోడలి ముఖం వాడిపోయి ఉండడం, నిమిషానికోసారి కళ్ళొత్తుకోవడం గమనించాడు దామోదరం. భార్య ద్వారా విషయం ఏంటో విన్నాడు.

"ఏమ్మా!మీ చెల్లెలి పెళ్లి ఆ యాభై వేల కోసం ఆగిపోవడం ఎందుకు? ఆ తక్కువైనవేవో మనం సర్దుదాం. మీ నాన్నగార్కి ఫోన్ చేసి చెప్పు'' అని కోడల్ని పిలిచి చెప్పాడు.

ఆ పిల్ల కళ్లల్లో వేనవేల కృతజ్ఞతలు, మొహంలో కోటి సూర్యుల ప్రభాతాలు. చాలారోజుల తర్వాత సంతృప్తిగా అన్పించింది దామోదరానికి.



"చూడు దామోదరం. మన పాతకాలపు తండ్రుల్లా ఉన్నదంతా పిల్లలకు ఊడ్చిపెట్టి వీధిన పడేది వద్దు. అలాగని కట్నాలకోసమో, లాంఛనాలకోసమో పండుగలు, పబ్బాలకు వియ్యంకులు మన బిడ్డలకు దోచిపెట్టడం లేదని ఏడ్చేదీ వద్దు. ఆ పైవాడి దయ వల్ల బాగానే సంపాదించుకున్నాం. మానవత్వంతో ఈకాలం తండ్రుల్లా మన కుటుంబానికి స్నేహితుల్లా ఆలోచిద్దాం'' అన్న రఘురామ్ మాటలు గుర్తుకొస్తుంటే సంతోషంగా అన్పించింది దామోదరానికి.

★